క్లుప్తంగా

ఉద్యమాలకు 'అప్పారి' స్ఫూర్తి


అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఐరాల: ఉద్యోగులు, ఉపాధ్యాయులు దివంగత యూటీఎఫ్ వ్యవస్థాపకుడు అప్పారి వెంకటస్వామిని స్ఫూర్తిగా తీసుకుని సమస్యల సాధనకు ఉద్యమించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతిని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఆయన సేవలను స్మరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లీలావతి, అరుణ్‌కుమార్, సరోజమ్మ, వాణి, కరుణ, సుధాకర్ పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



చిత్తూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి దాత పార్థసారథినాయుడు గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. చిత్తూరు నగరం తేనెబండ చర్చిలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న లాజరస్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న పార్థసారథినాయుడు రూ.10 వేలు అందజేశారు.

పార్కింగ్ స్థలం వేలం వాయిదా

కాణిపాకం: కాణిపాకం పంచాయతీలోని పార్కింగ్ స్థలం గుత్త హక్కుల వేలాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి తెలిపారు. ఈ నెల 26న కాణిపాకం పార్కింగ్ స్థలాన్ని వేలం వేయాల్సి ఉందని, అనివార్య కారణాలతో నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

అదాలత్‌లో విద్యుత్ సమస్యల పరిష్కారం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: అదాలత్‌లో వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. గురువారం తిరుపతి నుంచి విశ్రాంతి న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈ కార్యాలయం నుంచి అధికారులు పాల్గొన్నారు. గతనెల 8న పెనుమూరులో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌లో పేరుమార్పు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ మార్పు, కేబుల్ మార్పు వంటి పది సమస్యలు వచ్చాయని ఈఈ తెలియజేశారు. అందులో 7 సమస్యలను పరిష్కారించామన్నారు. మిగిలిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. డీఈ జ్ఞానేశ్వర్, జేఏఓ గోవిందరాజులు, ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామ సమీపంలో గురువారం ఉదయం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం..శాంతిపురం మండలానికి చెందిన మహేష్ 300 టెట్రా ప్యాకెట్లు,7 బీరు బాటిళ్లతో ద్విచక్రవాహనంలో వెళ్తుండగా తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. బైక్‌తో సహా మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.25వేలు ఉంటుందని ఎస్‌ఐ చెప్పారు.

భక్తిప్రపత్తులతో శతవర్ష కుంభాభిషేకం

- ఘనంగా కన్యకాపరమేశ్వరి ఊరేగింపు


కలశం ఊరేగింపు

కుప్పం: స్థానిక కొత్తపేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శతవర్ష కుంభాభిషేకం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయం నిర్మించి వందేళ్లు పూర్తి చేసుకోవడంతో ఈ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జగనన్న వెంటే జనం

- అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి


గుడిపాల: ఎన్నికల ప్రచారంలో మహిళలకు అభివాదం చేస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా తామంతా సీఎం జగనన్న పథకాలతో ఆనందంగా ఉంటున్నామని, వైఎస్సార్ సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకుంటామని చెబుతుండడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. తనను ఒక్కసారి ఆదరించండి, అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. గురువారం మండలంలోని రామభద్రాపురం పంచాయతీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీకే మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని హామీలను 99శాతం నెరవేర్చారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి అందించారన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో పథకం కింద లబ్ధిచేకూరిందని తెలిపారు. అభివృద్ధి జరిగి ఉంటేనే తమకు ఓటు వేయాలని కోరారు. గతంలో చంద్రాబాబునాయుడు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులు, డ్వాక్రా మహిళలను నట్టేట ముంచారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చారని తెలిపారు. ఏ గ్రామానికి వెళ్లినా అవ్వ,తాతల ముఖాల్లో చిరునవ్వును చూస్తున్నామని, తమ ఓటు జగన్‌బాబుకే వేస్తామని చెబుతున్నారన్నారు. డ్వాక్రా రుణమాఫీ, అమ్మ ఒడి, రైతుభరోసా, సున్నావడ్డీ, జగనన్న విద్యాకానుక, విదేశీకానుకలతో పాటు అనేక సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఈ సంక్షేమ ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జనార్దన్, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రాయల్, సాయికృష్ణ, గోళ్ల హరిప్రసాద్, రజినీకాంత్, శిలంబరసన్, సాయికృష్ణ, త్యాగరాజులు, రాజా, కారిమేఘన్, రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లడ్డురెడ్డి, జానికిరామిరెడ్డి, గౌతమ్, సూరి, వెంకటేష్‌రెడ్డి, ప్రకాష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


విజయానందరెడ్డితో అమర్‌నాథ్‌రెడ్డి

ఎన్ని పార్టీలు ఏకమైనా ఫ్యాన్‌దే విజయం

చిత్తూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జత కట్టినా వైఎస్సార్ సీపీదే విజయమని వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అమరనాథ్‌రెడ్డి తెలిపారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలు ముందు ఎన్ని పార్టీలు ఏకమై వచ్చిన నిలువలేవని తెలిపారు. వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని 'నేను సైతం' అంటూ బైక్ ప్రచార యాత్ర చేస్తున్న అమరనాథ్ గురువారం చిత్తూరుకు విచ్చేశారు. వైఎస్సార్ సీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ 175 నియోజకవర్గాల్లో పర్యటించి వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రచారం చేస్తానన్నారు. ప్రజలు జగనన్నను ఎంత ప్రేమిస్తున్నారో అమర్‌నాథ్‌రెడ్డి మంచి ఉదాహరణ అని విజయానందరెడ్డి అన్నారు. స్వార్థం లేకుండ అతను చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు.

వార్డు సచివాలయాలకు హైసెక్యూరిటీ సర్టిఫికెట్లు


హైసెక్యూరిటీ పత్రాల పంపిణీలో అధికారులు

చిత్తూరు అర్బన్: వార్డు సచివాలయాల ద్వారా అందించే వివిధ సర్వీసులకు సంబంధించి వినియోగించే హైసెక్యూరిటీ సర్టిఫికెట్లను గురువారం సిబ్బందికి కమిషనర్ జె.అరుణ పంపిణీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పరమైన లోగోలు లేకుండా ఉన్న హైసెక్యూరిటీ సర్టిఫికెట్లను వినియోగించాలన్నారు. మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై స్పందించండి

చిత్తూరు నగర పరిధిలో ఎన్నికల కోడ్ అమలుపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేపట్టాలని అధికారులను ఏఆర్వో, కమిషనర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై ఎంసీసీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, లా అండ్ ఆర్డర్ బృందాలతో ఏఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్నికల కోడ్ అమలు తీరును పక్కాగా తనిఖీ చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ భవనాలు, నైట్ సెంటర్లు, పెట్రోల్ బంకులు, దేవాలయాలు, బ్యాంకులు, టెలిఫోన్, తపాలా, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై ఎలాంటి రాజకీయపరమైన పోస్టర్లు బ్యానర్లు లేకుండా చూడాలన్నారు. రోజువారీ రిపోర్టులను సకాలంలో, సక్రమంగా అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జరిగే సంఘటనలను, తీసుకునే చర్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఎంఈ గోమతి , మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జ్ ఎంహెచ్వో చిన్నయ్య, సీఎంఎం గోపి, డీడీలు రమణ, వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఎన్నికల విధులకు నియమించిన వారు విధులకు హాజరుకాకుంటే కఠిన చర్యలుంటాయని చిత్తూరు నియోజకవర్గ ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి ఎన్నికల కసరత్తుపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, వివిధ టీమ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎంసీసీ నిబంధనలు పకడ్బందీగా అమల య్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కసరత్తు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్థాయిలో రాజకీయ పార్టీలకు సంబంధించి బ్యానర్లు, ఇతర పోస్టర్లు ఉన్నట్లైతే తొలగించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు, ర్యాలీ, సభలు, సమావేశాలకు ముందస్తుగా అనుమతులు పొందారో లేదో పకడ్బందీగా పరిశీలించాలని తెలిపారు. అనుమతులకు దరఖాస్తు చేసుకునే ఆయా పార్టీలకు నిబంధనల ప్రకారం వెంటనే అనుమతులు ఇవ్వాలన్నారు. ఉద్యోగులెవ్వరూ పార్టీ ప్రచారాల్లో పాల్గొనకూడదని చెప్పారు. ఎన్నికల విధులకు కేటాయించిన వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య, డిప్యూటీ కలెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే విధుల నుంచి తొలగింపు

- ఆర్డీఓ చిన్నయ్య


మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఉద్యోగులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్డీఓ) చిన్నయ్య తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వలంటీర్లు, చౌక దుకాణ డీలర్లు, మొబైల్ వ్యాను డ్రైవర్లు, ఆశావర్కర్లు, స్వయం సహాయక సంఘ ఏపీఎం, సీసీలు, ఉపాధి ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే సిబ్బంది.. ఎన్నికల ప్రచారం, బహిరంగ సభల్లో పాల్గొనకూడదని, పోలింగ్ బూత్‌లలో ఏజెంట్లుగా ఉండరాదన్నారు. కోడ్ ఉల్లఘించినట్‌లెతై విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల డీటీ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో నిర్లక్ష్యమొద్దు


అరగొండలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

తవణంపల్లె: ఎన్నికల కోడ్ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని మండల ఎన్నికల అసిస్టెంట్ అధికారి, తహసీల్దార్ అరుణ కుమారి ఆదేశించారు. గురువారం మండలంలోని జొన్నగురకల, అరగొండ, మత్యం, మల్లకుంట, దిగువమాఘం సచివాలయాలను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయపార్టీ నాయకులతో కలసి ప్రచారం చేసినా ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు ఉంటే తొలగించాలన్నారు. కార్యక్రమంలో భూ రీసర్వే డీటీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తం

యాదమరి: గ్రామీణ ప్రజలు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. గురువారం మండలంలోని పెరియంబాడిలో గ్రామస్తులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గ్రామీణులు, రైతులు ఎండలో పనులకు వెళ్లినా వడదెబ్బకు గురవుతారన్నారు. వడదెబ్బకు గురైన వారికి గుండె వేగంగా కొట్టుకుంటుందని, అధికంగా దాహం వేస్తుందని, కాళ్లు చేతులు వణుకుతాయని లక్షణాల గురించి వివరించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


మహిళా సంఘాల సభ్యుల మానవహారం

పూతలపట్టు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ నిర్మల కోరారు. ఓటు హక్కు వినియోగంపై గురువారం పూతలపట్టులో మహిళా సంఘాల సభ్యులతో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని, మంచి నాయకత్వం కోసం ఓటు వేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరత్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, సీసీలు సోమశేఖర్, శోభన్ పాల్గొన్నారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా కోర్సులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్టిఫికెట్ యోగా కోర్సుకు కనీస విద్యార్హత పదవతరగతి, తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. 16 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. డిప్లొమా కోర్సుకు ఇంటర్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. సర్టిఫికెట్ కోర్సు 6 నెలలు, డిప్లొమా కోర్సు ఏడాది కాల వ్యవధి ఉంటుందని చెప్పారు. ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441555990, 9182420973 నంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

సాహిత్యంతోనే చైతన్యం


మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేయడం సాధ్యమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ కవితా దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక స్థానిక కళామందిరంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్షరపు విత్తులను నాటి ఊహలతో సాగుచేసేవాడు కవి అన్నారు. సాహిత్య చదవడం సమాజంలో బాగా తగ్గిందని, సమాజం స్మార్ట్‌ఫోన్ గుప్పెట్లోకి వెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కనీసం మన భాషను బతికించుకోవాలన్నా పుస్తకాలను చదవడం ఇప్పటితరం అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మొహిద్దీన్, చంద్రశేఖరయ్య, సమితి కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి బూత్ కమిటీలే కీలకం


మాట్లాడుతున్న పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

- ప్రతి ఇంటినీ సందర్శించాలి
- పూతలపట్టు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

తవణంపల్లె: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపులో బూత్ కమిటీలే కీలకపాత్ర పోషించాలని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. గురువారం మండలంలో కాణిపాకం రోడ్డులోని నారాయణాద్రి కల్యాణ మండపంలో మండల బూత్ కమిటీ కన్వీనర్ రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సునీల్‌కుమార్ మాట్లాడారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం బూత్ కమిటీలు ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలో క్షుణ్ణంగా వివరించారు. ఎన్నికలకు సుమారు రెండు నెలలు వ్యవధి ఉండడంతో బూత్ కమిటీలు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారిని, తటస్థంగా ఉన్న వారితో మాట్లాడి పార్టీకి అనుకూలంగా ఓట్లు వేసేలా ప్రయత్నించాలన్నారు. వృద్ధుల ఓట్లను ఎలా పొందాలో చెప్పారు. గత ఎన్నికల కంటే అత్యధిక మెజారిటీ రావడానికి ప్రతి కార్యకర్తా నాయకులతో కలసి పని చేయాలని కోరారు.


హాజరైన బూత్ కమిటీ సభ్యులు

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేయడానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి నిర్వహించ తలపెట్టిన బస్సు యాత్రను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. వచ్చే నెల 3న పూతలపట్టుకు సీఎం జగన్మోహన్ రెడ్డి విచ్చేస్తారని, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గాంధీబాబు, హరికృష్ణారెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, పరమేశ్వరరెడ్డి, శరత్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, రవిరెడ్డి, మధుకుమార్, జగన్నాథరెడ్డి, విక్రంరెడ్డి, భాస్కర్‌నాయుడు, దినేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, తేజారెడ్డి, సుకేష్‌రెడ్డి, శివాజీరెడ్డి, కోదండ, హరీష్, ప్రశాంతకుమార్, మురుగన్, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సునీల్‌కుమార్ ప్రచారం


కరపత్రాన్ని అందజేస్తున్న సమన్వయ కర్త సునీల్‌కుమార్

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మండలంలోని పోటుకనుమ, అయ్యప్పగారిపల్లె, తోటవారిపల్లె, తిమ్మిరెడ్డిపల్లెలో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందాయని, అభివృద్ధి పనులతో రాష్ట్రం ముందుకుపోతోందని తెలియజేశారు. ప్రభుత్వ సేవలను ఇళ్ల ముంగిటకే తెచ్చిన ఘనత జగనన్నకే దక్కిందని, విద్య, వైద్యం, ఫ్యామిలీ డాక్టర్, రైతు భరోసా, చేయూత.. తదితరాలను ఓటర్లకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ స భ్యురాలు దేవిక, నాయకులు రాజారత్నంరెడ్డి, స ర్పంచులు బాబునాయుడు, అమర్నాథరెడ్డి, ఎంఎస్ మణి, ప్రవీణ్, మాసిలామణి, యతీష్ కో–ఆప్ష న్ మెంబర్ ఖాదర్, నాయకులు నిరంజన్‌రెడ్డి, ష ణ్ముగం, బాలాజీ, నాగరాజ, సింగిల్‌విండో అధ్యక్షు లు దొరస్వామిరెడ్డి, మండల యువత అధ్యక్షులు నవీన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంద్రవారిపల్లెలో...

శుక్రవారం మండలంలోని అంద్రవారిపల్లెలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ పార్టీ మండల కన్వీనర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వేప నూనె పిచికారీతో మంచి ఫలితాలు


పంట పరిశీలనలో శాస్త్రవేత్తలు, అధికారులు

చిత్తూరు రూరల్: కూరగాయల సాగులో రైతులు వేప నూనె పిచికారీ చేస్తే తెగుళ్ల బెడద ఉండదని, మంచి దిగుబడులు వస్తాయని డాట్ సెంటర్ శాస్త్రవేత్త రెడ్డి రామ్ సూచించారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో సాగవుతున్న పలు రకాల పంటలను ఆయన గురువారం పరిశీలించారు. కాకర, వంగ, మిరప, మామిడి పంటల సాగు విధానంపై ఆరా తీశారు. మిరపలో ముడత తెగులు, వంగలో పుచ్చు కాయ తెగులు ఉన్నట్లు గుర్తించి మందుల పిచికారీ పై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం లో వేప నూనె వాడకాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగమణి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పద్మజ, తుమ్మింద వ్యవసాయ సహాయకుడు మోహన్, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యం


గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది


ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత


తవణంపల్లె: జి.గొల్లపల్లెలో వైద్య పరీక్షలు

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని పేయనపల్లె గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల వద్దకు ఇళ్లకు వెళ్లి వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమందలో 'ఫ్యామిలీ డాక్టర్'

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నెల్లిమందపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 70మందికి వివిధ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నడవలేని పరిస్థితులో ఉన్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గొల్లపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని జి. గొల్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు, గర్భవతులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.